# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం, 1 సెప్టెంబర్ 2025


## ఘనంగా గణేష్ నిమజ్జనం

సిరికొండ, ఆగస్టు 31, ప్రభాతవార్త

గణేష్ నవరాత్రులలో భాగంగా మండలంలోని సుంకిడి, రిమ్మ, రాజంపేట, ధర్మసాగర్, జాకీర్ గూడ గ్రామాలలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆయా గణేష్ మండపాల వద్ద గ్రామస్తులు, మహిళలు పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం బ్యాండ్ భజంత్రీల మధ్య వినాయకుడి ఊరేగింపు ప్రారంభమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పూజ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యోగేష్, భారత్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

▲ ఎస్సీ, ఎస్టీ టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న

జన్నారం, ఆగస్టు 31, ప్రభాతవార్త:

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పిఆర్సి ని ప్రకటించి అమలు చేయాలని, ఎస్సీ ఎస్టీ టిఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న అన్నారు. జన్నారంలోని ఆర్ట్స్ అండ్ క్రియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయుల నియామకాల్లో అనుసరిస్తున్న రిజర్వేషన్ పదోన్నతులలో కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. క్యాడర్లలో సరిపడు ఉపాధ్యాయులు ఉన్నారనే సాకుచూపి రిజర్వేషన్లు అమలు చేయకపోవడాన్ని ఎస్సీ ఎస్టీ టీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుంది. పెండింగ్ డీఎలను వెంటనే చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దుచేసి, ఓపిఎస్‌ను అమలు చేయాలన్నారు. జి.ఓ 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులందరినీ, వారి వారి సొంత జిల్లాలకు పంపించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికీ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, వివిధ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్, పార్ట్ టైం ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు కనీస

మిగతా 2లో..





## సింగరేణి గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

❖ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ధరావత్ పంతుల నాయక్ ❖ మందమర్రి ఏరియా అధ్యక్షుడిగా రాము నాయక్

మందమర్రి, ఆగస్టు 31, ప్రభాతవార్త

సింగరేణి గిరిజనుల సంక్షేమ సంఘం 7856/2001 సమీక్ష సమావేశం ఆదివారం రోజున మందమర్రి పట్టణంలోని సిఈఆర్ క్లబ్‌లో నిర్వహించడం జరిగిందని బెల్లంపల్లి రీజియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి భూక్య పరశురాం, లైజన్ అధికారి గుగులోత్ బాబు జాదవ్ తెలిపారు. సింగరేణి గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ధారావత్ పంతుల నాయక్ అన్నారు. ఈ సమావేశంలో మందమర్రి ఏరియా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏరియా సివిల్ ఇంజనీర్ బానోత్ రాము నాయక్‌ను,

మిగతా 2లో..



## రైతులకు నష్టమే మిగిలింది

✵ పంటలపై ఇసుక మేటలు, బురద

✵ రైతుల కంట కన్నీళ్లు, వందల ఎకరాలలో పంట నష్టం

✵ దెబ్బతిన్న రహదారులు



లక్ష్మణ చందా, ఆగస్టు 31, ప్రభాతవార్త

అవసరం ఉన్నప్పుడు వద్దంటే పగబట్టినట్టే కురిసింది. చేతికి వస్తుందనుకున్న పొలం మొక్కజొన్న సోయాబీన్ ఇసుకపాలాయే. తెల్ల బంగారం అనుకుంటున్న పత్తి పంట నేల వాలిపాయె. సాయం అవుతాది అనుకున్న సోయపంట నీట మునిగిపాయె. మా కష్టం ఎవరికి చెప్పుకోవాలె అంటూ భారీ వర్షానికి పంటలు నష్టపోయిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. నిర్మల్ జిల్లాలో కురిసిన వర్షానికి ఎన్నో అనర్థాలను మిగిల్చింది. దాదాపు ఏడు ఎనిమిది గ్రామాలను వరద ముంచెత్తింది. దాదాపు 576 ఎకరాలలో పంటలపై ఇసుక మేటలు వేసి ఎందుకు పనికి రాకుండా ఆయా గ్రామాలలో వరి, పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంటలు కోలుకోని నష్టం వాటిల్లింది. భారీ వర్షాల కారణంగా ఎస్సారెస్పీ 42 గేట్లు తెరవడంతో గోదావరి ఉప్పొంగి మండలంలో ఆర్ అండ్ బి పంచాయతీ రోడ్లు ధర్మారం నుండి సోను కి వెళ్లే రోడ్డు మొత్తం కోత గురికావడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

2 లో..



సమావేశంలో పాల్గొన్న సింగరేణి గిరిజన ఉద్యోగులు



సన్మానిస్తున్న దృశ్యం

# సింగరేణి గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

గౌరవ అధ్యక్షులుగా వాంకుడోత్ దుప్ సింగ్, ఉపాధ్యక్షులుగా గుగులోత్ రాంబాబు, రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా ధారావత్ తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భూక్య ప్రవీణ్, కోశాధికారిగా బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా భూక్యా రవిని ఎన్నుకోవడం జరిగింది మందమరి ఏరియా మైన్స్, డిపార్ట్మెంట్ కమిటీలను ఎన్నుకున్నారు. కాసిపేట2 గని నుండి బోడ కాసిం అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా, భూక్యా అజయ్ కాసిపేట 1 నుండి ఫిట్ సెక్రటరీగా, బి.రాజ్ కుమార్ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా బాలాజీ, కేకే 5 గని నుండి పిట్ సెక్రటరీగా ఆత్రం మారుతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా గుగులోత్ రాజేష్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ధారావత్ పంతుల నాయక్ మాట్లాడుతూ, ముందుగా ఎన్నుకోబడిన నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం ఏరియా లోని గిరిజన సింగరేణి ఉద్యోగులు ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే ముందుగా ఏరియా కమిటీకి తెలియజేయాలని, కానిపక్షంలో సెంట్రల్ కమిటీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సింగరేణి గిరిజన ఉద్యోగులు సమిష్టిగా ఉండాలని, దక్కవలసిన హక్కుల గురించి పోరాడాలని అన్నారు. కొంతమంది కార్మికులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను సెంట్రల్ కమిటీ అధ్యక్షులు దృష్టికి తీసుకెళ్లారు. ఏరియాలో క్వార్టర్లు, రోస్టర్ పాయింట్ ప్రకారం గిరిజన ఉద్యోగులకి దక్కవలసిన పదోన్నతుల, తదితర విషయాల గురించి మాట్లాడారు. అనంతరం నూతన కేంద్ర కమిటీ సభ్యులను, ఏరియా కమిటీ సభ్యులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ ఉపాధ్యక్షులు తారాచంద్, బెల్లంపల్లి ప్రెసిడెంట్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.



## క్షమాపణ చెప్పాలి

**బోథ్, ఆగస్టు 31, ప్రభాతవార్త**

మండలంలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర బీజేపీ పార్టీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పార్లమెంట్ సభ్యుల పిలుపుమేరకు బోథ్ మండల కేంద్రం తరపున నిన్న బీహార్‌లో రాహుల్ గాంధీ పాదయాత్రలో వారి అనుచరులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారి మాతృమూర్తి పై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆదివారం బస్టాండ్ ఎదురుగా ధర్నా చేపట్టారు. మండల అధ్యక్షులు బోరే రవీందర్ మాట్లాడుతూ బీహార్‌లో చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, యువకులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ తల్లి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తాండూర్ మండల కేంద్రంలోని ఐబి సెంటర్‌లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన చేపట్టారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రధానికి ఆయా దేశ అధ్యక్షులు ప్రజలు నీరాజనం పడుతుంటే రాహుల్ గాంధీ దేశ ప్రధానిపై వారి తల్లి పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనియెడల బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు, సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, పులగం తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కోశాధికారి రాచర్ల సురేష్, సీనియర్ నాయకులు సిద్ధం మల్లేష్, ఆవుల చందు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 7న అండర్ 15 జూనియర్స్ చెస్ టోర్నమెంట్

**నస్పూర్, ఆగస్టు 31, ప్రభాతవార్త**

7న ఎక్సలెంట్ చెస్ అకాడమీ వారి ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని డిస్ట్రిక్ట్ జెట్ భవనంలో అండర్ 15 జూనియర్స్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో 15 సంవత్సరాల లోపు బాలబాలికలు పాల్గొనవచ్చని, టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు ఈనెల 5వ తేదీలోపు తమ పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. మొదటి 10 స్థానాలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీ బహుకరణ, ప్రతి ఏజ్ గ్రూప్‌కి ప్రథమ, ద్వితీయ, తృతీయ ట్రోఫీ బహుకరణ ఉంటుందన్నారు. క్రీడాకారులు, వారి తల్లిదండ్రులకు భోజన వసతి ఉంటుందని, పూర్తి వివరాలకు 9491532651 చరవాణిలో సంప్రదించాలని కోరారు.

## రక్షణ సమావేశాల్లో అన్ని జాతీయ కార్మిక సంఘాలను భాగస్వామ్యం చేయాలి

**- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి**

**నస్పూర్, ఆగస్టు 31, ప్రభాతవార్త**

సింగరేణి యాజమాన్యం నిర్వహించే అన్ని రక్షణ సమావేశాల్లో జాతీయ కార్మిక సంఘాలను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆదివారం నిర్వహించిన 49వ కంపెనీ స్థాయి రక్షణ త్రైపాక్షి క సమావేశంలో కేవలం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను మాత్రమే ఆహ్వానించడం సరికాదని అన్నారు. అండర్ గ్రౌండ్ గనుల్లో ప్రమాదాలు జరిగితే సింగరేణి యాజమాన్యం ప్రమాదాలను రికార్డు చేయకుండా గాయపడ్డ కార్మికులకు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించి సర్ఫేస్‌లో పని కల్పిస్తున్నారని ఆరోపించారు. కాలం చెల్లిన శక్తి లేని ఎస్‌డిఎల్ యంత్రం నడిపి కేకే5 గనిలో శ్రీకాంత్ అనే కార్మికుడు బండకూలి మరణించాడని అన్నారు. సింగరేణిలో ఏండ్ల తరబడి ఒకే తరహా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ప్రమాదాల నివారణకు యాజమాన్యం చర్యలు చేపట్టడం లేదని, రక్షణ విషయంలో నామమాత్రపు పర్యవేక్షణ చేపడుతున్నారని అన్నారు. కార్మికుల పిఎంఈలో తప్పుడు రిపోర్ట్స్ వస్తున్నాయని, సింగరేణి ఆసుపత్రుల్లో వైద్యుల కొరత ఉందని సరైన మందులు అందుబాటులో లేవని అన్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు బాలాజీ, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీపతి బానేష్, నాయకులు శ్రీనివాస్, శ్రీధర్, సదానందం, శ్రీనివాస్, సురేష్, కిషన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

వేతనం ఇవ్వాలన్నారు. నూతన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలని, ఉపాధ్యాయుల, పెన్షనర్ల, వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు 5571 పియస్ హెచ్‌యం పోస్టులను మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని, వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని, కెజిబివి, మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. కేజిబివి, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, మోడల్ స్కూల్, గురుకుల సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల అవార్డులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పదోన్నతి పొందిన రామ టెంకి శ్రీనివాస్‌కు సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బాదావత్ ప్రకాష్ నాయక్, జిల్లా అధ్యక్షులు రామటంకి శ్రీనివాస్, మండల అధ్యక్షులు తుగూరు గోపాల్, నాయకులు జాడి ధర్మయ్య, శంకర్, యుటిఎఫ్ దండేపల్లి మండల అధ్యక్షుడు రత్నం తులపతి తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జా చేశారని ఆరోపణలు చేయడం దారుణం

**నిర్మల్, ఆగస్టు 31, ప్రభాతవార్త**

మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి భూ కబ్జాలు చేశారంటూ పలువురు యువకులు సోషల్ మీడియాలో ఆరోపణలు చేయడం సరికాదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్మల్ ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడారు. 40 సంవత్సరాలుగా ఐకే రెడ్డి నిర్మల్‌ను అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. 1987 నుంచి 2025 వరకు జెడ్పి చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా నిర్మల్‌కు సేవలందించారని తెలియజేశారు. అంతేకాకుండా నిర్మల్ ను జిల్లాగా మార్చి, రోడ్లు ,గుళ్ళు , బడులు కట్టించిన చరిత్ర ఆయనకే దక్కుతుందన్నారు. ఇలాంటి నాయకుడు పై కొంతమంది యువకులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజలకు దూరంగా..హైదరాబాద్‌లో ఉంటున్నారన్నారు. ప్రస్తుతం ప్రజలు కష్టాలను తెలియజేసే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. పదవిలో ఉన్న లేకున్నా ఇంద్రకరణ్ రెడ్డి ఏడుపదుల వయసులో కూడా నిర్మల్ ప్రజల కోసం అనునిత్యం పోరాడుతున్నారని పేర్కొన్నారు. గత ఐదు రోజుల కింద కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను, వాగులను, చెరువులను, కూలిన ఇండ్లను పరిశీలించి, ప్రజలకు రైతులకు మనోధైర్యాన్ని కల్పించారన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇలాంటి నాయకుడిపై ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ప్రతిపక్ష నాయకులు, కొంతమంది యువకులు సోషల్ మీడియాలో ఐకే రెడ్డి పై చేస్తున్న ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రజలను తప్పుడు దోవ పట్టించడమే తప్ప వారికి ఇంకేం పనిలేదని మండిపడ్డారు. దమ్ముంటే ఇప్పటికైనా ఆరోపణలు చేయడం మానుకొని, కబ్జాలు చేసి ఉంటే నిరూపించాలని సవాలు విసిరారు. అనోవసరంగా ఐకే రెడ్డి పై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా ఐకే రెడ్డి పై ఆరోపణలు మానుకొని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇందులో బన్స పల్లి మాజీ పిఏసిఎస్ చైర్మన్ రమణారెడ్డి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్, సీనియర్ నాయకులు మూడుసు సత్యనారాయణ, నాలం శ్రీనివాస్, రాందాస్, శ్రీకాంత్ యాదవ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టమే మిగిలింది

(మొదటిపేజీ తరువాయి)

మండలంలోని పలు గ్రామాలలో వాన ప్రతాపం కొనసాగించడంతో గోదావరి పెరగడంతో వాటి కింద ఉన్న దాదాపు 576 ఎకరాలు పంట నష్టపోయినట్లు శనివారం మధ్యాహ్నామాధికారులు అంచన వేశారు ఇందులో ప్రధానంగా 285 రైతులకు చెందిన 315 ఎకరాల సోయా, 110 మంది రైతులకు చెందిన 125 ఎకరాల వరి ,55 మంది రైతులకు చెందిన 48 ఎకరాల పత్తి, 48 మంది రైతులకు 80 ఎకరాల మొక్కజొన్న మొత్తం 576 ఎకరాలలో పంటలు నీట మునిగాయని మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. పంటలు పొలాల చెరువులను తలపిస్తున్నాయని నీటి కింద ఏ పంట ఉందో గుర్తించడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. వరద తగ్గాక నష్టం మరింత పెరుగుతుందని వెల్లడించారు.



### నష్టపరిహారం చెల్లించాలి

మూడెకరాలలో మొక్కజొన్న సోయాబీన్ సాగు చేసిన భారీ వర్షాల కారణంగా ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో గోదావరి పొంగి పంటలు పూర్తిగా నీట మునిగింది. తమకు పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

**- మల్లెల నర్సయ్య, రైతు పీచర**

### మూడేళ్లుగా నష్టపోతున్నాం, ప్రభుత్వమే ఆదుకోవాలి

మండలంలోని గోదావరి పరివార ప్రాంతాలలో ఇంచుమించు 576 ఎకరాల పంట నష్టపరిహారం జరిగింది. పీచర, ధర్మారం, ముని పెల్లి, పార్ పెల్లి, చమన్ పెల్లి, చింతల్ చాంద, గ్రామాలలో పంట నష్టపరిహారం జరిగింది. దీనికిగాను ప్రభుత్వం ప్రతి రైతుకు పంట నష్టపరిహారం అందించాలని రైతుల తరపున ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

**- తిప్పని రాజేశ్వర్ తాజా మాజీ ఎంపీటీసీ (పీచార,ధర్మారం)**

